## జైనూర్‌లో ప్రశాంత వాతావరణం

జైనూర్ సెప్టెంబర్ 15 : జైనూర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొంటున్నది. ఆసిఫాబాద్, ఉట్నూర్ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతిచ్చారు. 144 సెక్షన్ కొనసాగుతున్నది. మల్టీజోన్-1 రేంజ్ డీఐజీ చంద్రశేఖర్ శనివారం శాంతి భద్రతల పరిస్థితిపై సమీక్షించారు. ఈ నెల 17న వినాయక నిమజ్జనం ఉండగా, అప్పటి వరకు ఎవ్వరినీ అరెస్టు చేయకూడదని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం పరిస్థితి కుదుట పడుతున్న నేపథ్యంలో నిందితుల అరెస్టులకు తాత్కాలిక విరామం ఇచ్చినట్లు తెలుస్తుంది.

## అంధకారంలో ఎల్లూరు ప్రధాన వీధులు

పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 15 : మండలంలోని ఎల్లూరు పంచాయతీ పరిధిలో వీధి దీపాలు లేక ప్రధాన రహదారులు అంధకారంలో మునిగిపోయాయి. ఎటు చూసినా చీకటిమయంగా మారింది. వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రజలు ఆలయాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రత్యేక అధికారి, జీపీ కార్యదర్శికి పలు మార్లు విన్నవించినా ఫలితంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమజ్జనం ఉన్న నేపథ్యంలో ఇప్పటికైనా స్పందించి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


వీధి దీపాలు లేక చీకటిగా ఎల్లూరు ప్రధాన రస్తా

## పురుషోత్తం రావు ఆశయ సాధన కోసం సేవ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 15 : దివంగత మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తమ రావు ఆశయ సాధనకోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. తన తండ్రి పురుషోత్తమ రావు 25వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో 8 వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించినట్లు స్పష్టం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం మాట్లాడుతూ.. మానవత్వంతో చేసిన సేవలు చిరస్థాయిలో నిలిచిపోతాయన్నారు. ఈసీజీ, 2డీ, ఎకో, అల్ట్రా సౌండ్, రక్త, మూత్ర పరీక్షలు చేయించి, మందులు పంపిణీ చేశారు.

## బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వేణుగోపాల్‌రావు

మందమర్రి, సెప్టెంబర్ 15: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బేర వేణుగోపాల్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు ఆదివారం వేణుగోపాల్ రావుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రావు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బత్తుల సతీశ్‌బాబు, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, శివ రామకృష్ణ, రాంచందర్, కుమార్, రాజు, వేణు, సంతోశ్, నర్సోజీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇంజినీర్స్ డే


ఇంజినీర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, డైరెక్టర్

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 15 : జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉభేద్ బిన్ యాహియా, డైరెక్టర్ వినాయక్ జిల్లా కేంద్రంలో ఇంజినీర్లు శశిధర్, హ్యూమన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 15 : లక్షెట్టిపేటలోని ఐదు మసీదుల్లో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను పట్టణ ఎస్ఐ సతీశ్ పరిశీలించారు. నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మసీదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న ముస్లిం మైనార్టీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీశ్, మసీదు కమిటీ సభ్యులు షాహిద్ అలీ, నవాబ్‌ఖాన్, చాంద్, ఇలియాస్, శెబ్బు, అన్వర్, షఫీ, షాహిద్, జావిద్, హఫీజ్ తదితరులు ఉన్నారు.

## ఫొటో అండ్ వీడియో జర్నలిస్టు అసోసియేషన్

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 15 : మంచిర్యాల జిల్లా ఫొటో అండ్ వీడియో జర్నలిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి సతీశ్, ప్రధాన కార్యదర్శిగా మాదరబోయిన శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఎల్లబెల్లి శ్రీకాంత్, కోశాధికారిగా మారం రఘు, ప్రచార కార్యదర్శిగా నరెడ్ల రాము, గౌరవాధ్యక్షుడిగా ఈసంపల్లి రమేశ్‌తోపాటు, పది మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు వీడియో, ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 15 : కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీకి చెందిన అశోక్ యాదవ్ (42) ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ శంకరయ్య ఆదివారం తెలిపారు. కూలీపని చేసుకునే అశోక్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్య సరస్వతి ఈ నెల 6న పుట్టింటికి వెళ్లగా, అశోక్ ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్థాపం చెంది ఇంట్లో ఉరేసుకున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కలవారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూడగా, ఉరేసుకొని కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆదివాసీ తోటి సేవా సంఘం సభ్యులు

లక్షెట్టిపేట, సెప్టెంబర్15 : ఆదివాసీ తోటి సేవా సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందిన దత్రు, నారాయణ, ఎస్‌ఏ తిరుమల, రాజవేణు, రఘునాథంను ఆదివారం పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు రవీందర్, అధ్యక్షుడు వల్క చిలుకయ్య, వెంకటేశ్, సంతోష్‌కుమార్, మోతీరామ్ ఉన్నారు.

# ఇసుక కొరతతో ఉపాధి కరువు

- ఖర్జీ ప్రభుత్వ రీచ్ నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ నిలిపివేత
- రెండు నెలలుగా నిలిచిన భవన నిర్మాణ పనులు
- 3 వేల మంది కార్మికులకు ఇబ్బంది
- పునరుద్ధరించాలని అధికారులకు వేడుకోలు


తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు(ఫైల్)


కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం ఇస్తూ..(ఫైల్)

బెల్లంపల్లి, సెప్టెంబర్ 15 : నిర్మాణ రంగంలో ఎంతో ప్రాధాన్యమున్న ఇసుక.. ఆన్‌లైన్‌లో బుకింగ్ ప్రక్రియ రెండు నెలలుగా నిలిచిపోయింది. నెన్నెల మండలం ఖర్జీ వద్ద చెక్‌డ్యాం నిర్మాణంతో ఈ సమస్య మొదలైంది. ఇసుక కొరత ఏర్పడడంతో భవన నిర్మాణ కార్మికులందరికీ ఉపాధి లేకుండా పోయింది. దీంతో నెన్నెల, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాలకు చెందిన మూడువేల మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రేపు, మాపు అనుమతులు వస్తాయని ఎదురుచూస్తూనే రెండు నెలలు గడిచిపోయింది. చేతిలో చిల్లిగవ్వలేక అప్పు చేసి సరుకులు కొనితెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇలాగే ఉంటే రోడ్డున పడాల్సి వస్తుందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, ఇసుక బుకింగ్ ప్రక్రియ పునరుద్ధరించాలని కార్మికవర్గం వేడుకుంటున్నది.

నెన్నెల మండల ఖర్జీ ప్రభుత్వ రీచ్ నుంచి నియోజకవర్గంలోని పలు మండలాల ప్రజలు ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకుంటారు. తమ అవసరాల మేర గృహ, భవన నిర్మాణాలు చేసుకుంటారు. అయితే ఖర్జీ వద్ద వ్యవసాయ పనుల నిమిత్తం నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల చెక్‌డ్యాం నిర్మించింది. వర్షాకాలంలో చెక్‌డ్యాం ముందు నీరు నిలిచి బురదచేరడంతో రీచ్ దగ్గరకు ట్రాక్టర్లు వెళ్లి ఇసుక తీసుకురావడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆ దారి గుండా నీరు నిలవడంతో ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితి. రోడ్డు గుంతలుగా మారి ట్రాక్టర్లు అందులో కూరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ ప్రక్రియను సంబంధిత అధికారులు నిలిపివేశారు. దీంతో రెండు నెలలుగా గృహ నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వర్షాకాలం ముగిసే వరకు ఇలాగే ఉంటుందని మైనింగ్ అధికారులు పేర్కొంటున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే యథావిధిగా రీచ్‌కు వెళ్లే మార్గం సుగుమమవుతుందని, ఇసుక ఆన్‌లైన్ ప్రక్రియను అప్పుడే పునరుద్ధరిస్తామని చెబుతున్నారు. ఇప్పటికే రెండు నెలలు దాటాయని మరో రెండు నెలలు ఉపాధిలేకపోతే రోడ్డున పడాల్సి వస్తుందని భవన నిర్మాణ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### 3వేల మంది కార్మికులు..

నియోజకవర్గంలోని నెన్నెల, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాలతో పాటు పట్టణానికి చెందిన మూడు వేల మంది భవన నిర్మాణ కార్మికులున్నారు. తాపీ మేస్త్రీలు, కూలీలు, ప్లంబర్, వెల్డర్, సెంట్రింగ్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్లు, పీవోపీ వర్కర్లు, మార్బల్ మేస్త్రీలు, పెయింటర్స్ ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు, ఇతర కార్మికులు ఇదే రంగాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. వీరే కాకుండా భవన నిర్మాణ సామగ్రి విక్రయించే దుకాణదారులు కూడా గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, తమకు ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ ప్రక్రియ పునరుద్ధరించాలని కోరుతున్నారు.

### ట్రాక్టర్లు వెళ్లేలా పనులు చేపట్టాలి..



*ఆన్‌లైన్‌లో ఇసుక రాకపోకపోవడంతో భవన నిర్మాణ కార్మికులందరూ ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూవారీ కూలీతోనే బతికే కార్మికులు రెండు నెలలగా చాలీచాలనీ జీవనం గడుపుతున్నారు. కార్మికుల్లో 90 శాతం మంది ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. భవన నిర్మాణానికి దాదాపు పది విభాగాలకుపైగా వివిధ పనులు చేసే వర్కర్లు ఉన్నారు. వారంతా ప్రస్తుతం రోడ్డున పడ్డారు. ఖర్జీకి వెళ్లే దారి ట్రాక్టర్లు కూరుకుపోకుండా చేసే పనులకు తమ సంఘం డబ్బు పెట్టుకుంటుంది. ఆ దారి సుగుమం చేసి, ఆన్‌లైన్ ప్రక్రియను కొనసాగించాలి.*

**- తాడిశెట్టి రాంకుమార్, తాపీ కార్మిక సంఘం అధ్యక్షుడు**

### పనులు లేకపోతే బతికేదెట్లా..



*ఎలక్ట్రీషియన్ పని మాత్రమే చేస్తా. ఏ ఇతర పనీ నాకు చేయడం రాదు. భవన నిర్మాణాలు కొనసాగితేనే ఉపాధి దొరికేది. పనులు ఎక్కడికక్కడే ఆగిపోవడంతో ఒక్కడినే కాకుండా ఈ రంగంపై ఆధార పడ్డ చాలా మంది దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. మా దాంట్లో ఈ రోజు కూలీకి పోతే ఆ రోజు డబ్బు అన్నట్లు చాలా మంది ఉన్నారు. వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అధికారులు స్పందించి వెంటనే ఆన్‌లైన్ ఇసుకను తెప్పించేలా చూడాలి. వర్షాకాం పోయేదాకా అంటే మరో రెండు నెలలు ఆగాలి. అంతకంటే ముందే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.*

**- మహ్మద్ సల్మాన్, ఎలక్ట్రీషియన్**

# వినాయకులకు ప్రముఖుల పూజలు..


మంచిర్యాల అర్బన్ : పూజల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు


ఆసిఫాబాద్ టౌన్ : పూజల్లో ఎమ్మెల్యే కోడుకు సాయినాథ్

మంచిర్యాల అర్బన్/ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 15 : గణేశ్ నవరాత్రుల్లో భాగంగా నిత్యం పూజలు, అన్నదానాలు కొనసాగుతున్నాయి. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 21వ వార్డు శ్రీ సాయిరాం గణేశ్ మండలి వద్ద మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్ఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండలి వద్ద వేలంపాట నిర్వహించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాయి నగర్ భజరంగ్ గణేశ్ మండలి వద్ద ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఆమె కొడుకు కోవ సాయినాథ్ వినాయకుడికి పూజలు చేశారు.

# పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు చేయాలి

- కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం


కాగజ్‌నగర్ : గణేశ్ నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 15 : కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు వద్ద గణనాథుల నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. పెద్దవాగు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కాగజ్‌నగర్ పట్టణం నుంచి పెద్దవాగు వరకు సకాలంలో గణనాథులు చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. పట్టణ సీఐ శంకరయ్య, ఎస్ఐలు సుధాకర్, మహేందర్, నాయకులు కీర్తి శ్రీనివాస్, నియజుద్దీన్ బాబా, మున్సిపల్ సిబ్బంది రఫీక్ తదితరులున్నారు.

తాండూర్, సెప్టెంబర్ 15 : గణేశ్ నిమజ్జనం, శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తాండూర్ ఎస్ఐ డీ కిరణ్‌కుమార్ తెలిపారు. నిమజ్జనం సందర్భంగా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రహదారులను బ్లాక్ చేయకుండా వరుస క్రమంలో వెళ్లాలన్నారు. రహదారి పక్కన ఉన్న దుకాణాలను కూడా మూసివేసేలా యజమానులు సహకరించాలన్నారు. సాంప్రదాయ, సాంస్కృతిక నృత్యాలు, భజన సంకీర్తనలతో ముందుకు సాగాలని సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

చింతలమానేపల్లి, సెప్టెంబర్ 15 : మండలంలో గణేశ్ నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ సూచించారు. మండపాల కమిటీ సభ్యులు పోలీసుల సలహాలు, సూచనలను పాటించాలని తెలిపారు. సాయంత్రం 3 గంటల్లోగా కార్యక్రమాలు ముగించుకోవాలని సూచించారు.

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 15 : మండలంలోని వివిధ గ్రామాలతో పాటు, మండల కేంద్రంలో నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నాగమ్మ చెరువు సమీపంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

## వర్గీకరణ అమలుకు కమిటీ సరికాదు


శ్రీరాంపూర్ : సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 15 : ఎస్సీల అభిప్రాయాన్ని తీసుకోకుండా వర్గీకరణ అమలుకు కమిటీ వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలితం శంకర్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ కాలనీ విశ్వశాంతి హైస్కూల్‌లో ఆదివారం నియోజకవర్గ అధ్యక్షుడు గరిసె రామస్వామి అధ్యక్షతన నస్పూర్ మున్సిపాలిటీ జాతీయ మాల మహానాడు, జై భీమ్ సైనిక్ దళ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలితం శంకర్, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల నవ్, జే నర్సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్ శ్రీనివాస్ పాల్గొని, మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రుల కమిటీ నియామకానికి వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పోరాడుతుందన్నారు. మంత్రుల కమిటీలో మాల వర్గానికి చెందిన మంత్రి ఎందుకు లేడని ప్రశ్నించారు. మంత్రుల కమిటీలోనే మాలలకు అన్యా యం జరుగుతున్నదన్నారు. అలాంటప్పుడు మాలలకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. అనంతరం జాతీయ మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధిగా తలారి రాజు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శిగా ఐత పరమేశ్, ఉపాధ్యక్షులుగా పుట్ట రవి, కార్యదర్శిగా బింగి సదానందంను నియమించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెవుల వాసు, దొంత మురళి, అనిల్, బత్తుల స్వామి, సంతోష్, పోశం, శ్యాముల్, రత్నయ్య, విటల్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

### నియోజకవర్గ అధ్యక్షుడిగా కాటం రాజు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 15 : జాతీయ మాల మహానాడు అనుబంధ యూత్ విభాగం జై భీమ్ సైనిక్ దళ్ మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడిగా నస్పూర్‌కు చెందిన కాటం రాజు, మాలమహానాడు పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఐత పరమేశ్వర్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం నియామక పత్రాలను మాల మహానాడు నేతలు వారికి అందజేశారు. పదవిని ఇచ్చిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, కన్వీనర్ ఆసాది పురుషోత్తం, అందుకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, నియోజకవర్గం అధ్యక్షుడు గరిసె రామస్వామి, ఎర్రోళ్ల నరేశ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తలారి రాజు, గుమ్మడి శ్రీనివాస్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా పశువులను రవాణా చేస్తే చర్యలు

రెబ్బెన, సెప్టెంబర్ 15 : అక్రమంగా పశువులను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. పుంజుమెరగూడ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు తెలిపారు. లారీలో పశువులు తరలిస్తున్నారని సమాచారం మేరకు తనిఖీలు చేయగా, ఓ లారీలో 20 ఎడ్లు, 15 ఆవులు ఉన్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన సాధిక్ గడ్చిరోలి జిల్లా నుంచి నిజామాబాద్ వైపునకు పశువులను తీసుకెళ్తున్నాడని చెప్పారు. ఈ మేరకు పశువులను గోషాలకు తరలించినట్లు, లారీని సీజ్ చేసి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.


పట్టుబడిన పశువులు



ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఏఎస్ఐ మోహన్ రాథోడ్

## ప్రజలకు అవగాహన కల్పించండి

రెబ్బెన, సెప్టెంబర్ 15 : ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల ప్రజలకు రైళ్ల రాకపోకలపై అవగాహన కల్పించాలని ఆర్పీఎఫ్ ఏఎస్ఐ బెల్లంపల్లి మోహన్ రాథోడ్ మండలంలోని వివిధ పార్టీల నాయకులకు సూచించారు. ఆర్పీఎఫ్ సీఐ సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు రెబ్బెన మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్‌లో ఆదివారం వందేభారత్ రైలు వేగం గురించి వివరించారు. వందేభారత్ రైలు ఈ ప్రాంతం గుండా రాకపోకలు సాగిస్తుందని తెలిపారు. కాగా, రైలు సమయాలు గుర్తుంచుకునేలా ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన మండలంలోని వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటీఐలో నేడు వాకిన్ అడ్మిషన్లు

నస్పూర్, సెప్టెంబర్ 15 : ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన 27 సీట్లకు మంగళవారం వాకిన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గోదశలో భాగంగా 17న ఉదయం 11 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, అదేరోజు మధ్యాహ్నం ఒంటి గంటలోగా ఐటీఐ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని పేర్కొన్నారు. ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీలో 12 సీట్లు, ఎలక్ట్రానిక్స్ మెకానిక్‌లో 6, మెకానిక్ మోటార్ వెహికల్‌లో 5, టర్నర్‌లో 3, కోపలో 1 సీటు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ సీట్లలో ప్రవేశాలు కావాలనుకునేవారు మంగళవారం తమ నిజ ధ్రువీకరణ పత్రాలతో హాజరవ్వాలని సూచించారు.

## 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 15 : మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ఈ నెల 18న భవన నిర్మాణ ఐఖ్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 23 చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు, పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ అడ్వైజరీ కమిటీని నియిమించి నిధులు మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని కోరారు. నాయకులు మంతెన మల్లయ్య పాల్గొన్నారు.

## హాజీపూర్‌లో నిమజ్జన ఘట్టాలు లేవు

హాజీపూర్, సెప్టెంబర్ 15 : గణేశ్ నవరాత్రులను పురస్కరించుకొని హాజీపూర్ మండలంలో ఎక్కడా నిమజ్జన ఘట్టాలను ఏర్పాటు చేయలేదని తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే, ఎస్ఐ గోపతి సురేశ్, ఎంపీడీవో మధుసూదన్ ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. వినాయక ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు అధికారికంగా ఏర్పాట్లు చేయలేదని పేర్కొన్నారు. వినాయక మండపాలను ఏర్పాటు చేసిన వారు ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు దండేపల్లి మండలం గూడెం గోదావరి వద్ద, జైపూర్ మండలంలోని ఇందారం బ్రిడ్జి వద్ద, మంచిర్యాల గోదావరిలో నిమజ్జన చేయాలని సూచించారు.

## ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

హాజీపూర్, సెప్టెంబర్ 15 : ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొన సాగుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 148 మీటర్లు కాగా, పూర్తిస్థాయిలో నిండింది. ఆదివారం ఎగువ నుంచి 14,516 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 5 గేట్లను ఎత్తి 14,095 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. అలాగే హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం 305 క్యూసెక్కుల నీటిని, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

## ఎంపీ పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎంపీ వంశీ, నాయకులు

నెన్నెల, సెప్టెంబర్ 15 : నెన్నెల మండలం కుష్నపల్లి మాజీ సర్పంచ్ బెల్లంపల్లి సంధ్య మామయ్య మల్లారెడ్డి ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మల్లారెడ్డి చిత్రపటం వద్ద నివాళర్పించారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు గట్టు మల్లేశ్, నాయకులు హరీశ్‌గౌడ్, తోట శ్రీనివాస్, నర్సింగారావు ఉన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 15 : కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టీ) మండల కేంద్రం మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సిర్పూర్(టీ) ఎస్ఐ కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎండీ అఫ్జల్, ఎండీ తాజ్ బోలోరె వాహనంలో సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా, జక్కాపూర్ శివారులో పట్టుకున్నారు. వాహనం సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పద్మశాలీ సంఘం సమావేశం

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 15 : కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలీ ఎన్నికల నిర్వహణకు ద్వారకానగర్‌లో గల సంఘ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించినట్లు పట్టణాధ్యక్షుడు దాసరి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శి పదవీకాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ కమిటీని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చెప్పారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ పర్యవేక్షణలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు ఉంటాయని, పద్మాశాలి సేవా సంఘం సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

## మద్యం మత్తులో యువకుడి మృతి

జైపూర్, సెప్టెంబర్ 15 : జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన గొలాడ మల్లేశ్ (38) మద్యం మత్తులో వాటర్‌ట్యాంకుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య సుమలత మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మల్లేష్ ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం తాగి, వాటర్ ట్యాంక్ ఎక్కాడు. ఎక్కి దూకడంతో తలకు తీవ్ర గాయాలై, అక్కడిక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు శనివారం నుంచి తమ కొడుకు కనిపించడం లేదని వెతకడంతో వాటర్ ట్యాంక్ సమీపంలో శవమై కనిపించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

## ముగిసిన అర్ధచాతుర్మాస్య దీక్షలు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 15 : గోదావరికాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీగీతా ప్రశాంతి నిలయంలో అర్ధ చాతుర్మాస్య దీక్షలు ముగిశాయి. శ్రీమద్భగవద్గీత సత్సంగం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 62 రోజుల పాటు దీక్షలు చేపట్టారు. ఆదివారం 62 రోజుల అధ్యక్ష కళశాలతో భక్తులు ఊరేగింపు చేపట్టి, గీతా మందిర్‌కు చేరుకున్నారు. ప్రధాన కలశ పూజ, గీత యజ్ఞం నిర్వహించారు. హరి మౌనస్వామితో మాల విరమణ చేశారు. శ్రీమద్భగవద్గీ సత్సంగం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు దాసరి రాజేశం భక్తులకు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు. సొసైటీ సభ్యులు సీహెచ్ రాంబాబు, ఆరు మల్లేశ్, మనోహర్, సాంబార్ రాజేశం, నారాయణ, రాజేశ్వరి, స్వర్ణకుమారి, ఆనందం, రాజులు, శంకరయ్య, శ్రీనివాస్, తిరుపతి, మారేపల్లి సారయ్య తదితరులు పాల్గొన్నారు.